

అలనాటి కథ

# అబద్ధాలు

బుచ్చిబాబు

"సాయంత్రం బండికి వూరెడుతున్నా" అన్నాడు రాజారావు.

"ఏ వూరు?" అనడిగింది ఆయన భార్య సునీత.

"ఇంకేవూరు? ఏటేటా ఏ వూరెడుతున్నానో ఆ వూరే-ఏముంది పరీక్షలు-ఫిజిక్స్ ప్రాక్టికల్స్, ఛీఫ్ ఎగ్జామినర్‌గా తగులడాలిగా!" అని కాస్తంత విసుగ్గా అన్నాడు.

"ఎలాగబ్బా-నాకు తోచదు. మళ్లీ చప్పునొచ్చెయ్యండి."

"రాక అక్కడ చేసేదేముంది?"

సాయంత్రం బండికి ప్రయాణమయ్యాడు రాజారావు. ఆ ఊరు చేరుకునేటప్పటికి పదిగంటలైంది. తిన్నగా జట్కాబండిని జైల్ల సూపరింటెండెంట్ గారి బంగళాకి పట్టించమన్నాడు. బండి దిగగానే, గేటులో ఇద్దరు పోలీసులు అటకాయించారు. తను ఫలానా, ఫలానా కోసం వొచ్చాననన్నాడు. లోపలికి తీసుకెళ్లారు.

ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక తొట్టతొలి సంచిక అయిన 15.8.1952 సంచికలో ప్రచురించాము.

జైలు సూపరింటెండెంట్ -నీలకంఠంగారు పెట్రోమాక్స్ లైటు వెలుగులో ఏవో రాస్తూ కూర్చున్నాడు.

వరండాలోకి వెళ్లగానే, లేచి మందహాసం చేసి ఆహ్వానించాడు. పెట్టే, బెడ్డింగ్ ముందుగదిలో పెట్టించాడు. భోజనం సిద్ధం చెయ్యమని వంటాయనికి పురమాయించాడు.

"మీరు రావడం చాలా సంతోషం. పరీక్షల రోజులు, రావడం పడదేమో అనుకున్నాం, నేనూ, సుమిత్రా."

"చూచి చాలా సంవత్సరాలైంది. ఓ సారి చూచిపోదామని ఎలాగో తీరిక చేసుకుని వొచ్చివడ్డాను" అన్నాడు రాజారావు. కాసేపు ఎవ్వరూ మాటాడలేదు. రెక్కలపురుగులు పెట్రోమాక్స్ లైటుమీద పడి రోదిస్తున్నాయి.

"సుమిత్ర ఎప్పుడూ మీ మాట చెబుతుంటుంది" అన్నాడు నీలకంఠం.

"ఏరీ, ఆమె కనిపించరేం?"

నీలకంఠం బిగ్గరగా నవ్వితేగాని, నవ్వినట్టు గ్రహించడం కష్టం. మీసాలు దట్టంగా మూతిని కమ్ముకున్నాయి.

"క్షమాపణ చెప్పమంది-వాళ్ల తమ్ముడికి పెండ్లి సంబంధం వొచ్చిందట-పిల్లని చూడ్డానికి ప్రొద్దున్నే వెళ్లింది."

"అలాగా-"

మళ్లా నిశ్శబ్దం.

"మిసెస్ రాజన్‌ని కూడా తీసుకురాలేకపొయ్యారా?" అని అడిగాడు నీలకంఠం.

"మీరు మరిచిపొయ్యారేమో, నా పేరు రాజారావు. మా ప్రిన్స్‌పాల్ రాజన్."

"ఎస్, ఎస్. అవునవును. అన్నట్టు రాజన్ ప్రిన్స్‌పాల్. ఏవిటో ఈ రెండుపేర్లూ ఎప్పుడూ యిల్లానే మిక్సప్ చేసేస్తూంటాను. అఫ్‌కోర్స్, నేనాయన్ని ఎరగననుకోండి. మా సుమిత్ర ఆయన దగ్గర చదువుకుంది. అవునవును

-రాజారావు-మా సుమిత్ర మీ విషయం తరచు చెబుతుంటుంది."

"అవును. ఆమే, నేనూ ఇంటర్ వొకే కాలేజీలో చదివాం. ఆవిడ నోట్సు లేకుంటే, నేను ప్యాసయ్యేవాడినే కాదు" అన్నాడు రాజారావు.

"ఏం చదువులు, ఇంటర్ ఇంతవరకూ ప్యాసవనేలేదు. పరీక్షకి కట్టమంటే, వినిపించుకోదు. తరవాత మాట్లాడుకుందాం-భోజనం కానివ్వండి..."

పెట్రొమాక్స్‌లైటు టప్‌మని ఆరిపోయింది.

రాజారావు భోజనానికి వెళ్లాడు. అతనికి నవ్వొచ్చింది. రాజన్‌కి పంపిన ఆహ్వానం, పోస్టువాడు తనకిచ్చాడు. సుమిత్రా, తనూ కలిసి చదువుకున్నారు. సుమిత్ర వివాహానికి తను వెళ్లాడు. ఇంకా జ్ఞాపకం వుంచుకొని, తనని ఆహ్వానించిందనుకుని ఎంతో సంతోషించాడు. ఇప్పుడా సంతోషానికి ఆస్కారం లేదు. పాపం, నీలకంఠం చమత్కారంగా మాట తప్పించి, సర్దేశాడు. రాజారావుకి చిన్నతనంగా వుంది. ఆ రాత్రి ఎలాగో గడిపి ప్రొద్దున బండికి బిచాణా ఎత్తేద్దామనుకున్నాడు.

భోజనం చేసి వరండాలోకొచ్చాడు. "ఉదయం మాట్లాడుకుందాం. అల్లా ఆ గదిలో పడుకొండి -ప్రయాణం బడలికగా వుంటుందిగా మరి! నేను యీ ఆఫీస్ పేపర్స్ చూసుకుంటూవుంటాను" అన్నాడు నీలకంఠం.

బ్రతుకు జీవుడా అనుకుని, రాజారావు వరండాలో పచార్లు సాగించాడు. హాల్లో దీపం తన గది కిటికీలోంచి కళ్లల్లోకి పొడుస్తోంది. దాన్ని తగ్గిద్దామని హాల్లోకెళ్లాడు. హాల్లో రెండు సోఫాలూ, కార్నర్ టేబిల్సు, మూడు కుర్చీలూ వున్నాయి. గోడని ఫొటోలు, బొమ్మలు తగిల్చివున్నాయి. దీపం వెలుగులో ఫొటోలకేసి చూశాడు. తనూ, సుమిత్రా వున్న కాలేజీ ఫొటో చూశాడు. అప్పటికీ, యిప్పటికీ తనలో ఎంతో మార్పుంది; కొంచం లావెక్కాడు. జుట్టు నుదుటిమీది నుండి, వెనక్కి జరిగింది; వొతు తగ్గింది; కండ్ల కింద నల్లగీతలున్నాయి. సుమిత్ర తనని చూసి ఏమనుకుంటుందో! తనని ఆమె చూడనందుకు ఓ విధంగా సంతోషించాడు. సుమిత్ర ఆ రోజుల్లో కాలేజీకి 'జ్యూలియెట్.' ఆవిడున్న సెక్షన్‌లో వుండి చదువుకొంటున్న విద్యార్థులు ధన్యులుగా ఎంచబడేవారు. వారితో మాట్లాడి, వారి పరిచయం పొందడానికి మిగతా విద్యార్థులు ఉబలాటపడుతుండేవారు.

రాజారావు ఆమె వద్ద నుండి నోట్సు తీసుకున్నందుకు కథానాయకుడయ్యాడు. నిట్టూర్చి తిరిగి నోట్సు ఆమెకిచ్చేశాడు. అతను జీవితంలో మధురంగా వొదిలిన నిట్టూర్పు అదొకటే. అదొక గొప్ప అనుభవం. అతనింతవరకూ ఆ నిట్టూర్పు విషయం ఎవ్వరికీ చెప్పలేదు. పైగా భార్యతో అబద్ధమాడాడు నోట్సు పుచ్చుగుంటూ, సుమిత్రే నిట్టూర్చిందని. చిన్న అబద్ధమే. కాని, దాన్ని పురస్కరించుకొని, భార్య అతన్ని ప్రతిరోజూ వొక్కమారేనా దెప్పిపొడుస్తుంటుంది. తరవాత తరవాత, అంతా వొట్టిది, నిట్టూర్పూ లేదు, గిట్టూర్పూ లేదు-అంటే, భార్య నమ్మదు. 'ఇదెక్కడి కర్మ, అబద్ధం నమ్ముతారు, ఆడవాళ్లు!' అనుకున్నాడు. ఎప్పుడూ అబద్ధమాడకూడదనుకున్నాడు.

ఏం లాభం? అబద్ధమాడి ప్రయాణం కట్టాడు. ఆహ్వానం అందగానే, అది తనకి కాదనీ, ప్రిన్స్‌పాల్ రాజన్‌కి వుద్దేశించబడిందనీ అతనికి స్ఫురించింది కూడా. తనకే ఎందుకవగూడదని ఆత్మవంచన చేసుకుని సమాధానపడి సుమిత్రకి తను జ్ఞాపకం వున్నందుకు గర్వించి కొండంతై, ఎక్కడలేని వుత్సాహాన్నీ తెచ్చిపెట్టుకుని, భార్యతో ఛీఫ్ ఎగ్జామినర్‌గా వెళ్లాలని వొంకెట్టి సుమిత్రని చూడడాని కోసం ప్రయాణమయాడు. ఇందుకోసమని చెబితే భార్య వో పక్షాన రానిచ్చునా? అసలింటో బతకనిస్తుందా? ఒక మంచికార్యం కోసం, తన సంతోషం కోసం, ఇదొక్కటే అతనాడిన అబద్ధం-ఇంకెప్పుడూ ఆడను-అని తీర్మానించుకుని, ఆ ఫొటోని గోడకి తగిల్చి, నిట్టూర్చి, తన గదిలోకొచ్చి పడుకున్నాడు.

రాజారావుకి నిద్ర పట్టలేదు. బద్ధకంలో, అలుపులో ఏవో నిట్టూర్పులు,

తెల్లారింది.

ఎనిమిదైంది.

నీలకంఠం గుమాస్తా గదిలోకొచ్చాడు. తనే పరిచయం చేసుకున్నాడు-"నమస్కారం-రాజారావుగారూ... మీరొచ్చినందుకు సంతోషం."

"నా పేరు మీకెట్లా తెలుసు?"

"నీలకంఠంగారు చెప్పారు. అసలు విషయం మనవి చేస్తున్నా. ఆహ్వానాలు పంపమని అడ్రెసుల జాబితా యిచ్చారు. కొన్ని అడ్రెసులు మా వాడొకడు వ్రాశాడు. ఆ రాయడంలో మీకని వుద్దేశంచిన ఆహ్వానంపై ప్రిన్స్‌పాల్ రాజన్ అని వ్రాసినట్టున్నాడు. అది నీలకంఠంగారు చూసి, అమ్మగారికిచ్చారు. ఆవిడ ఎరుగున్నవాళ్లకి కొన్ని పంపుకొన్నారు లెండి. అడ్రెసు ఆవిడ సరిగ్గా రాసి, పోస్టు చేయించారన్నమాట. వొస్తా. తొందర పన్లున్నై. మధ్యాహ్నం ఫంక్షన్‌లో కలుసుకుందాం" అంటూ వెళ్లిపొయ్యాడు.

. రాజారావుకేమీ అర్థం కాలేదు. ఆహ్వానం తీసి చూశాడు. 'ప్రిన్స్‌పాల్' అని లేదు. ఎవరో 'రాజన్'ని 'రాజారావు' అని దిద్దారు. అది సుమిత్ర పనే అయివుంటుంది. నీలకంఠం తనని 'రాజన్' అని ఎందుకనుకున్నాడో యిప్పుడు తెలుస్తోంది. 'రాజన్' కన్నడప్రాంతీయుడైనా, చాలామంది తెలుగువాడుగా భావించి, 'రాజారా'వని వ్రాసిన వుత్తరాలు, యిదివరలో చాలాసార్లు 'రాజారావు' అందుకుని ఆయనికి యిచ్చివేస్తూండడం జరిగేది.

అవుతే, 'ప్రిన్స్‌పాల్' అని ఎందుకు లేదో అతనికి బోధపడలేదు. ఆఁ, యిప్పుడు బోధపడింది. రాజన్‌కి పంపిన ఆహ్వానం రాజన్‌కి చేరే వుంటుంది. సుమిత్ర తనకి వేరే ఆహ్వానం పంపివుంటుంది. కాబట్టి, సుమిత్ర తనని ఆహ్వానించినట్లుగా భావించొచ్చు. అవుతే, వొక రహస్యం వుంది. ఈ సంగతి ఆమె భర్తకి తెలియపర్చలేదు. కారణం?

## అబద్ధమాడని వారెవరు?

ప్రసిద్ధరచయిత మార్క్ ట్వేన్ ఒక మారు ఆస్ట్రియాలో పోలీసులతో చిక్కుపడ్డాడు. ఆ తగాదాలోంచి తప్పించుకునేందుకు తాను బ్రిటిష్ రాజకుటుంబానికి చెందినవాడినని చెప్పుకున్నాడు. వెంటనే లక్ష క్షమాపణలతో ఆయునను వదిలివేశారు.

ఈ సంగతి తన ఇంగ్లీషు మిత్రునికి చెప్పగా, "ఇంత పెద్ద అబద్ధం ఆడినావా?" అని అతడు విస్తుపోయాడు.

ఇంతలో అటు వెడుతున్న ఒకపెద్దమనిషిని చూచి ఆ ఇంగ్లీషు మిత్రుడు మొగమింత చేసుకొని మందహాసం చేశాడు.

"ఆయున మీకు తెలిసినవాడా?" అని మార్క్‌ట్వేన్ అడిగితే "అబ్బే! లేదు. ఆయున నన్ను గుర్తించినట్టు కనిపిస్తే నేనూ నవ్వాను" అని ఆ మిత్రుని జవాబు.

"అయితే నువ్వు కూడా అబద్ధాలు ఆడేవాడివే!"

"నేను నోరు విప్పనిదే! అబద్ధం ఆడిన దెప్పుడు?"

"నోరు విప్పకనే నీ ప్రాణస్నేహితుడని ముఖంతో సూచించావు. అది మొదటి అబద్ధం. ఇది తప్పుకాదని నీకు నీవు చెప్పుకుంటున్నావు. అది రెండో అబద్ధం. మనందరం అబద్ధాల మనుషులమే!" అని మార్క్‌ట్వేన్ ముగించాడు.

ఏమో-అతని గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి-

ఆలోచించే వ్యవధి లేదు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, నంబియార్ చక్కా వొచ్చాడు. నీలకంఠం రాజారావుని పరిచయం చేశాడు. ఆయన షేక్‌హాండ్ యిచ్చాడు. రాజారావు చెయ్యి గట్టిగొ నొక్కి వూపేశాడు. దెబ్బతో వేళ్లు నలిగిపొయ్యాయి. ఉద్యోగం హోదాలోని మజా అంతా ఆ షేక్‌హాండ్‌లోనే వుంది.

వారి సంభాషణ రాజారావుకర్థం కాలేదు. ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు, పార్టీలు, రాజకీయాలు, ఆ వాతావరణంలో ఇతనికి స్థానం లేదు. వారంతా ఆర్థికంగా పై అంతస్థు మీదివారు, అసలతను యిక్కడకి రావడమే బుద్ధితక్కువనిపించింది.

ఒచ్చే కార్లు, వెళ్లే కార్లు, జనం, గడబిడ, పూలమాలలు, 'బొకే'లు, కుర్చీలు, బెంచీలు, డవాలి బంట్రోతులు, పోలీసులులారీలు, జనం-పది, పదకొండు-ఎవరో అతన్ని భోజనానికి తీసికెళ్లారు.

భోజనం అయింది.

మళ్లా గదిలోకొచ్చిపడ్డాడు.

ఈలలు-పెద్దకేకలు, చట్టున అంతా నిశ్శబ్దం. అతన్ని వో లారీలో ఎక్కమన్నారు.

"ఎక్కడికి?"

"జైలుకి."

"ఎందుకు?"

నవ్వులు. "ఫంక్షన్‌కి రారూ?"

"అవునవును."

లారీలో ఎక్కాడు. జైల్ ఆవరణలో దిగాడు. ఖైదీల చేతిపరిశ్రమలను పౌరులకి చూపించే నిమిత్తమై ఏర్పాటైన ఫంక్షన్ అది. జిల్లా కలెక్టర్ అధ్యక్షుడు. ఖైదీలు అల్లిన బుట్టలు, చాపలు, కాళ్లపేచులు, నవారు, కర్రసామాను-ఇవన్నీ పెద్ద హాల్లో అమర్చబడివున్నాయి. మాటల్లో ఆఫీసర్లు కుర్చీలలో కూర్చున్నారు. స్త్రీజనం, పూలు, సెంట్ల పరిమళం, సిల్కుచీరలు గాలిలో చేసే చప్పుడు, అల్లా చూస్తూ నిలబడగానే పెద్దపెద్ద కేకలు, విజిల్సు-లారీ నిల్చిన చప్పుడు. అందులోంచి ఖైదీలు దిగారు. అందరూ వరసగా నిలబడ్డారు., కొందరు లారీలోనే వుండిపొయ్యారు. లారీని దూరంగా లాగేశారు. అందులో వున్న ఖైదీలు కూడా దిగిపొయ్యారు. ఒక్కడే మిగిలిపొయ్యాడు.

అతని మొహం ఎక్కడో చూసినట్టనిపించింది రాజారావుకి. జ్ఞాపకం వొచ్చింది-చంద్రన్న!

చంద్రన్నది రాజారావు అత్తవారి వూరు. ఒకటిరెండుమార్లు అతను తోలే జట్కాబండిలో భార్యాసమేతంగా పొరుగూరిలో సినిమాకి వెళ్లాడుకూడా. చంద్రన్నను గురించి బోలెడు కథలున్నాయి. చాలా మొండివాడు, ధైర్యశాలి, ప్రాణాలకి తెగించి ఏ పనేనా చేసిపారెయ్యగలడు. రౌడీ కూడా. స్త్రీల జోలికి పోడు. పోలీసులకి అతనంటే బెదురుట! చిన్నచిన్న నేరాలకిఎవడిదో చెయ్యి విరగ్గొట్టడం, మోకాలు కింది కత్తిపోటు యిట్లాంటివాటికి జైళ్లలో వుంచడం, వొదిలెయ్యడం జరిగింది. రెండుమూడు ఖూనీకేసుల్లో కూడా అతని పనేనని పోలీసులు నమ్మినా, తగినంత సాక్ష్యం దొరక్క, అతన్ని శిక్షించడానికి వీలుపడింది కాదు.

కొన్ని వారాలపాటు మనిషి మాయమవుతాడుట. మళ్లా సర్దంతా మణిగింతర్వాత ఆ వూళ్లోకి సిద్ధమవుతాడుట.

రాజారావు అత్తవారింట్లో అతనికి చనువు జాస్తి; ఎన్నోమార్లు అక్కడే భోజనం చేసి పడుకునేవాడు. ఒకసారి చేలో పనిచేస్తుండగా, అతని కర్ర తగలగా త్రాచుపాము అతనిమీదికి లేచిందట. అతను చేతిలోని కర్రని మట్టిలో పాతి, అనిపొగా కర్రమీద తగిల్చాడుట. పాము ఆ కర్రని కాటేస్తుండగా, యితను పరుగెత్తుకుపొయ్యాడుట. చంద్రన్న సాత్వికుడిలా కనిపిస్తాడు. వెర్రిబాగులవాడు; డబ్బు కాపీర్నం బొత్తుగా లేదు. బీడీలు కాలుస్తాడు-ఎప్పుడేనా తాగుతాడు. వేరే వ్యసనాలేమీ లేవు. చంద్రన్నంటే, జనానికి నష్టం!

రాజారావు చంద్రన్న లారీకేసి వెళ్లాడు. గుంపులో జనం వెన్నులు లారీ వెంపుకున్నాయి. అంతా ఆ గంద్రగోళంలో పడిపోయారు. చంద్రన్న కళ్లుముసుకుని, కునికిపాట్లు పడుతున్నాడు.

"చంద్రన్నా!"

ఉలిక్కిపడి లేచి,. కళ్లు నులుముకున్నాడు. "మీరాండి-ఈ రొంపిలోకొచ్చారేంటి?"

"జైలు సూపరింటెండెంటుగారుఅంటేకొంచం నన్నెరుగుదుర్లే. పిలిస్తే వొచ్చాను" అన్నాడు రాజారావు.

"ఏదైనా సాక్షానికాండి?"

"అబ్బే-యిదుగో, యీ ఫంక్షన్ అవుతోందే, చూసిపోదామని."

"ఇదంతా వో తంతు లెండి. ఏదో కూతంత పొద్దోతుంది నాకు మట్టుకు వొళ్లు బద్ధకం" అని నవ్వాడు చంద్రన్న.

"నువ్వు మళ్లా జైల్లోకెందుకొచ్చావు?"

"నేనెందుకొత్తాను? ఈడేం పని? ఆళ్లే బలాత్కారంగా లాక్కొచ్చి పడేశారు-నాయెదంగాళ్లు!"

"ఏం జరిగిందేమిటి?"

"మీరెరగర్లెండి. మా యింటిది సచ్చింది. నే సంపానంటారు, శనిగాళ్లు!"

"అసలు విషయం ఏమిటి?"

"మీకేం తెలుత్తయండి మా షాయిగొడవలు? మా యింటిది-రత్తి-అల్లదో, రెడ్డి సత్తెయ్యనెరగరండీ-పుగాకు యాపారం, ఆడు దీనెంట పడినాడంట. అదంతా వుత్తదిలెండి. ఆడది అలుసీకపోతే, ఏ మొగపక్షిగాడు మీసం లెగుతుందండి-ఎట్టైతేనేం లెగండి, ఆడు దానంట పడితేనేం, యిదాడెంట పడితేనేం, యిద్దరూ అట్లా సాగించారు. నా కళ్ల పడిందండి. ఏం పనే కుక్కవని అని కూత్తంత కసిరినానండి. రెడ్డిసత్తెయ్య, లగో లగు-దొడెత్తినాడు. శనిపక్షిగాడు. మా రత్తి కూతురంటుందీ-'నేనీడ సాపేసి తొంగున్నా, ఆడొచ్చి ఎగబడి, మీదడబోతుంటే ఏటిది సత్తెయ్యా, నా మొగోడు సూత్తే, నన్ను సీరెండేత్తాడన్నాను-ఆడు యినిపించుకోకుండా, రగడ సాగిత్తుంటే నువ్వొచ్చినా-యింతే బిసి-అన్నదండి. నాకు మాచెడ్డ తట్టుగా వేసుకొచ్చిందండి, ఎంతుకంటారా? రత్తిముండ అబద్ధమాడిందండి. అది మరో పరాయిశనిగాడితో వుందట, నాకు తెలిత్తే, నేను దాన్ని సంపి, చీరి ఎండేత్తానట. నాయంత మంచివోడు భూపపంచం

### అంతరాలు

1915 ఏప్రిల్‌లో గాంధీజీ మదరాసుకు వచ్చి జి.వి. నటేశన్‌గారికి అతిథిగా ఉన్నారు. బిసెంటు, అడయారుకు గాంధీజీని ఆహ్వానించింది. చక్కగా అలంకరించిన భవనంలో అతిథి సత్కారాలు సక్రమంగా జరిగాయి. ఇంద్రభవనంలా ఉన్న హాలులో నుంచి-తర్వాత ప్రక్కనే వున్న ఓ పూరిగుడిసెలోనికి బిసెంటు గాంధీజీని, నటేశన్ మొదలైన మిత్రులను తీసుకొనివెళ్లింది. అది అస్పృశ్యులకోసం ఏర్పరచిన పాఠశాల.

ఈ రెంటికీ ఉన్న అంతరం చూచి గాంధీజీ దారుణంగా బాధపడ్డారు. ఆ రాత్రికి అక్కడే ఉండాలన్న తలంపు మానుకొని ఎంత బలవంతం చేసినా ఆగక తిరిగి నటేశన్‌గారి ఇంటికి (తంబుచెట్టివీధి) వచ్చివేశారు.

మీదుండాడంటారా? నేనట్టాంటివోణ్ని కానని తెలుసు-అంటే అబద్ధమాడిందన్నమాటేగా? నూరు సెప్పండి, ఎయ్యి సెప్పండి, నాలిక పదును, మాట నిలకడ, కత్తిదెబ్బ, సమమండి. ఆ మటున, నేనన్నా, 'వోసెర్రిమొగమా, నువ్వేయాలుగాడితో లేసెడితే నాకెంతుకే, ఆడితో నా గురించి ఎంతుకబద్ధమాడినా, సెప్పు?' అన్నానండి. నోరెల్లబెట్టింది గుంట. ధూత్, అబద్ధం ముదనష్టం ముండ!" చంద్రన్న కాండ్రించి వూశాడు.

జనం చప్పట్లు కొడుతున్నారు. కప్పులు, సాసర్లు, చిల్లరచప్పుళ్లు వినబడుతున్నాయి.

"తరవాతేం జరిగింది?"

"ఏం జరుగుద్దండి? అంతే-అది అబద్ధమాడినందుకు, నాకు సివమెత్తి, దవడమీద డోలు మోగించాను. అమ్మోనని పడిందండి. నాటకం తొక్కుతోంది కాబోసనుకుని బైటకెళ్లానండి. గంటయాక, రంగమ్మ గురకవేసుగుంటూ వొచ్చి, 'రత్తి సచ్చింది, మావో...' అంటూ ఏడుపులంకించుకుంది. కరణంగోరు, పోలీసోరు సాక్షికాలు-లాక్కొచ్చి యాడ పడేశారు. శనివక్షిగాళ్లు ఆళ్లకేదో మిన కావాలి. ఇద్దొరికింది. పట్టండెహె అన్నారు, పట్టుగున్నారు" చంద్రన్న నవ్వు మీసం కిందనుంచి కనబడుతోంది.

"అవులే, చంపానని వొప్పేసుకున్నావా?"

"నేనొప్పుగోనండి. దవడ పగలేసిన మాట సాయానా నిజం. తట్టుకోలేక సచ్చింది. నా కాడ అబద్ధాల బతుగు సాగదండి. నా పేరేంటో తెల్సునాండి? అరిచెంద్రుడు, మా అమ్మ అట్టాగే పిలిసేదండి. సిత్రం-మా వూళ్లో నే గొట్టికాయలాడేవాణ్ని. కుర్రతనం. దాసరి బసవయ్య, ఆళ్లు అరిచ్చెంద్ర నాటకం ఆడినారు. నే సూశానండి. పెళ్లాన్ని కత్తెత్తి సంపబోతాడండి. ఆ యమ్మ అబద్ధమాడింది గనగనే. ఆ కాడి నుంచి చీ-అబద్ధం గూడదు, అని పమాణం సేసుకున్నానండి."

రాజారావు ఏదో అడుగుదామనుకుంటుండగా, జనం కదలడం మొదలెట్టారు. మళ్లా విజిల్సు, కార్లు, కేకలు, గంద్రగోళం బైలుదేరింది. ఫంక్షన్ అయిపోయింది. ఖైదీలని లారీలోకెక్కించి వేశారు. జనం పల్చబడ్డారు. కుర్చీలు, బల్లలు, కప్పులు, సాసర్లు చిందరవందరగా వున్నాయి. నేలమీద పూలు, సిగరెట్టుముక్కలు, కాగితాల చెత్త, దారాలు ఎవరో తుడవడం మొదలెట్టారు.

రాజారావు హాల్లోకొచ్చి బల్లమీద నడుం వాల్చాడు. అతనికి భయమేసింది ఎందుకో.

చివాలున లేచి గదిలోకెళ్లి హోల్డాలు, పెట్టె అతనే తీసుకొని గేటుదాకా నడిచివెళ్లాడు. బండిని ఆపుచేసి, అందులో సామాను పెట్టించాడు. నీలకంఠం గుమాస్తా వొచ్చాడు.

"అయ్యగారు కలెక్టర్‌గారితో వెళ్లారు. చెప్పకుండానే వెళ్లిపోతారా?"

"ఏముంది చెప్పేటందుకు? బండికి టైమైంది. మరీ మరీ అడిగినానని చెప్పండి... అమ్మగారితో... కూడా..."

"అమ్మగారు రెండురోజుల వరకూ రామని టెలిగ్రామిచ్చారండి."

రాజారావు బండిలోకెక్కాడు. తన వూరికి చేరుకున్నాడు.

రైల్లో ఆలోచించి వొక నిశ్చయానికొచ్చాడు. తన బ్రతుకంతా అబద్ధాల కూర్పు! ఆ మాటకొస్తే నీలకంఠం, సుమిత్రల బతుకూ అంతే! అంతా అసత్యాల అల్లిక, నటన, దగా-సంస్కారంతోపాటు నటన, దగా అబద్ధాలు ఎదుగుతూవుంటాయి. తన జీవితవిధానమే మార్చివెయ్యాలి. అబద్ధాలాడకూడదు! భార్యకి అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పివెయ్యాలి! ఏదీ దాచకూడదు! అన్నీ చెప్పివేసి, భార్య ఒడిలో మొహం దాచుకుని ఏడవాలి. ఆమె కరిగిపోయి, మొహాన్ని తన చేతుల్లోకి తీసుకుని జాలిగా కళ్లలోకి చూచి, క్షమించి నిజంగా ఆప్యాయపడుతుంది. తనామె నింకెప్పుడూ మోసం చెయ్యకూడదు!

ప్లాట్‌ఫారం గేట్లో పరధ్యాన్నంగా టికెట్టు బదులు అగ్గిపెట్టె నిచ్చాడు టికెట్ కలెక్టర్‌కి.

ఇంటికి వెళ్లాడు. భార్యతో, అనుకున్నట్లుగా అంతా చెప్పి, ఆమె వొడిలో మొహం దాచుకుని ఏడ్చాడు.

ఆమె నవ్వుతూ అన్నది: "మీకు పరీక్షలు లేవనీ, వూరెళ్లాల్సిన పని లేదనీ నాకు తెలుసు. మీ స్టూడెంటొకడు చెప్పాడు. మీకొచ్చిన ఆహ్వానం చూశాను. మీరెందుకెళ్లారో తెలుసు. ఏం జరుగుతుందో చూద్దామని తెలియనట్లు అబద్ధమాడాను. చంద్రన్నగాడివన్నీ అబద్ధాలు! ఒక్కమాటా నమ్మకండేం?" అని నవ్వేసేసింది.

చంద్రన్న అబద్ధమాడడని నాకెందుకనిపించిందో యింతవరకూ బోధపళ్లేదు. నిజాన్ని నిజమే కనుక్కోవాలి! ■

## గుర్రం జాషువా

(క్రీ.శ. 1895-1971)

పేదల ఆక్రందనలకు ప్రతిస్పందించి కటిక పేదవాని కడుపులోని చిచ్చుని ఆర్పగల మార్గాల అన్వేషణలో తన కవితాప్రతిభను తోడుగా గ్రహించిన అగ్రశ్రేణి ఆధునికకవి జాషువా. భారతజాతిని కవితాత్మకంగా కీర్తించిన కవిరాజు జాషువా.

1895 లో గుంటూరు జిల్లా వినుకొండలో జననం. టీచరు ట్రైనింగు సైనా ఉపాధ్యాయవృత్తి స్వీకరించారు. ఉభయభాషా ప్రవీణుడై, 1929 నుండి కొంతకాలం గుంటూరు జిల్లా బోర్డు పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేశారు. మద్రాసు 'ఆకాశవాణి'లో కొంతకాలం ప్రొడ్యూసర్ ఉద్యోగం చేశారు. సరసశైలిలో ప్రయోగాలు చేయటంలో సిద్ధహస్తులు.



ఖండకావ్యప్రక్రియకు తెలుగు కావ్యప్రపంచంలో ఆయన కల్పించిన స్థానం అమోఘమైనది. ఆయనను 'కవికోకిల, కళాప్రపూర్ణ, పద్మభూషణ' బిరుదులు వరించాయి. కనకాభిషేకం, గజారోహణ మొదలైన గౌరవాలు ఆయనకు దక్కాయి.

సంప్రదాయసిద్ధమైన ఛందస్సులలో ఆ మహాకవి చెప్పిన పద్యాలు యావదాంధ్ర కావ్యరసికుల హృదయాలలో పూలవల్లరులై పల్లవించాయి.

'పిరదౌసి, గబ్బిలము, నా కథ' మొదలైన జాషువా రచనలు తెలుగు కవితకెత్తిన వైజయంతికలు.